క్లుప్తంగా

ట్రాఫిక్ క్లియర్ చేసిన ఎమ్మెల్యే



ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ట్రాఫిక్ క్లియర్ చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణలో పాల్గొని వెళ్తుండగా.. అంబేద్కర్ చౌక్‌లో వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేడు మున్సిపల్ సర్వసభ్య సమావేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 30న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ జోగు ప్రేమేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి కౌన్సిల్, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్- అఫీషియో సభ్యులు, ఆయా శాఖల మున్సిపల్ అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

బోథ్: డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మౌనిక కోరారు. శుక్రవారం కోర్టులో ప్రాంగణంలో ఎస్సైలు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. రాజీపడటానికి అవకాశం ఉన్న కేసులను పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, రూపేందర్ సింగ్, హరీశ్, కుమ్మరి విజయ్, ధమ్మపాల్, జమీర్, రాజు పాల్గొన్నారు.

నోట్ బుక్‌లు పంపిణీ

గుడిహత్నూర్: మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పీవీజీ మాధవీలత తన భర్త పీవీజీ రాజు గతంలో ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన జ్ఞాపకార్థం ఆమె శుక్రవారం 300 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిశ్చయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో ఉదయ్‌రావ్, హెచ్‌ఎం సంతోష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, సామాజిక కార్యకర్త కాంబ్లే బాలాజీ మాదిగ సతీమణి కాంబ్లే శాంతాబాయికి మెరుగైన వైద్యం అందించాలని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అపెండెక్స్ చికిత్స పొందుతుండగా.. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ శుక్రవారం రిమ్స్ ఆస్పత్రికి సందర్శించి పరామర్శించారు. రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మాజీ ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మకంటి మహేశ్‌కుమార్ గౌడ్‌ను యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిసిన ఆయన శాలువాతో సత్కరించారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

నార్నూర్: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని గాదిగూడ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని లోకారి(బి) గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రూమ్ టు రీడ్ ఇండియా ఎన్జీవో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, రూమ్ టు రీడ్ టీం సభ్యులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలి

ఎదులాపురం: జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు పెంచాలని బహుజన ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ గొల్లమండల అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. రాజ్యాంగ రక్షణ, పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న నిరసనల్లో సమితి జిల్లా నాయకులు, కార్యకర్తలు, బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. నాయకులు రాజ్‌కుమార్, చైతన్య, ఆకాశ్ పాల్గొన్నారు.

అందని 'మధ్యాహ్న' బిల్లులు

- అప్పు చేసి వంటలు చేస్తున్న నిర్వాహకులు
- ఐదు నెలలుగా ఎదురుచూపు
- బిల్లులు చెల్లించాలని వేడుకోలు



వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. గత ఐదు నెలలుగా కూరగాయలు, వంట సరుకులు, కోడిగుడ్ల బిల్లులు రాక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, లక్కారం జిల్లా పరిషత్ పాఠశాల, ఉర్దూ పాఠశాలలతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

తప్పని తిప్పలు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద అందిస్తున్న వంట సరుకులు, కూరగాయలు కోడిగుడ్ల బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు నెలలుగా ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల కోడిగుడ్లు అందిస్తున్నప్పటికీ ఆ బిల్లులు రాకపోవడంతో, అప్పు చేసి సమయానికి వంటలు చేస్తున్నామని వాపోతున్నారు. అంతే కాకుండా రోజు రోజుకూ మంచి నూనె, వంట సరుకులు, గుడ్ల ధరలు పెరిగిపోతుండటంతో వంట నిర్వాహణకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ఇట్టి విషయంపై అధికారులు దృష్టి సారించి బిల్లులు అందేలా చూడాలని కోరుతున్నారు. దుకాణాల్లో అప్పు పెరిగిపోతుందని వాపోతున్నారు. అదే విధంగా తమ వేతనాలు కూడా మంజూరు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

బిల్లులు చెల్లించాలి



రోజు రోజుకూ నిత్యవసర సరుకుల రేట్లు పెరగడంతో ఆర్థిక భారం పడుతుంది. దుకాణాల్లో అప్పు చేసి సరుకులు తీసుకువచ్చి వంటలు చేస్తున్నాం. నాలుగు నెలలుగా రాక పోవడంతో దుకాణాల్లో సైతం సరుకులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. పిల్లలకు భోజనాలు పెట్టడానికి ఇబ్బంది పడుతున్నాం.

– గంగమ్మ, నిర్వాహకురాలు, ఉట్నూర్ జెడ్పీ పాఠశాల

'ఉద్యమకారులను పట్టించుకోని ప్రభుత్వం'




మాట్లాడుతున్న శ్రీశైలం

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసండ్ల శ్రీశైలం అన్నారు. శుక్రవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తులకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కానీ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన కానిస్టేబుల్ కిష్టన్న వర్ధంతి చేయడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారులను పట్టించుకోకుంటే స్థానిక సంస్థ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ముక్తల్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ వరకు పాదయాత్ర చేపడుతామన్నారు. అనంతరం ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉపాలిని నియమించారు. నాయకులు నేతావత్ రాందాస్, రామారావు, దేవిదాస్, ఫయ్యాజ్, మారుతి ఉన్నారు.

ఉద్యమకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాములు

బోథ్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన బూస రాములు నియమితులయ్యారు. శుక్రవారం మండల కేంద్రానికి వచ్చిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం నియామకపత్రం అందజేశారు. తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, పింఛన్ అందించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమకారుల సంఘం నుంచి సర్పంచులు, ఎంపీటీసీల స్థానంలో పోటీ చేస్తామని శ్రీశైలం అన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్ స్తంభం చుట్టూ తీగజాతి మొక్క అల్లుకుంది. ఇటీవల ఆ స్తంభానికి విద్యుత్ దీపాలను అమర్చిన మార్కెటింగ్ సిబ్బంది తీగను మాత్రం అలాగే వదిలేశారు. దీంతో లైటు వెలుగులు సరిగా రావడం లేదు. – కైలాస్‌నగర్

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

తాంసి: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ అన్నారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారుచేసిన భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. వంటగది పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తిని రుచి చూశారు. ఉపాధ్యాయులు మహేందర్, కాంచన, విద్యార్థులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: ఆశ్రమ పాఠశాలలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వడగామ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. వంట గదితో పాటు నిత్యావసర సరుకులు, స్టోర్ రూంలో నిల్వ ఉంచిన సరుకులను, మధ్యాహ్న భోజనం కోసం వండిన వంటలను పరిశీలించారు. వండిన వంటలను ముందుగా కమిటీ సభ్యులు భోజనం చేసిన తరువాతే విద్యార్థులకు అందించాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్‌కు మాతృ వియోగం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజుకు మాతృ వియోగం కలిగింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన మాతృమూర్తి చింతకుంట్ల దేవుబాయి శుక్రవారం మధ్యాహ్నం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు శనివారం పిట్టలవాడలోని శ్మశానవాటికలో నిర్వహించనున్నట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. మాజీ మంత్రి జోగు రామన్న, మున్సిపల్ అధికారులు తిరుపతి, సుమలత, జాదవ్ కృష్ణ, కమిషనర్ నివాసానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: చలి తీవ్రత పెరుగుతున్న సందర్భంగా తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థపకుడు బండ అనిల్ కుమార్, ఇచ్చోడ మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, భూషణ్, విజయ్, కుర్ర నరేశ్, అనుముల ఉదయ్, సామల రవి, కుర్ర రవీందర్ పాల్గొన్నారు.

టీజీవో అధ్యక్షుడికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: టీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కె.శివకుమార్‌ను గ్రాడ్యుయేట్స్ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, ఏవోలు విశ్వమిత్ర, విశ్వనాథ్, రమణ, సతీష్, శంకర్, శివ చరణ్, స్ఫూర్తి, నివేదిత, ప్రణీత, కీర్తి, శివప్రసాద్, యోగిరాజ్, కొండిబా, నరేశ్ పాల్గొన్నారు.

రక్తదానం

ఆదిలాబాద్‌టౌన్: మిత్రుడి జ్ఞాపకార్థం తోటి స్నేహితులు రక్తదానం చేశారు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఎస్.వినిత్ రావు జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు శుక్రవారం రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. గత తొమ్మిది సంవత్సరాలుగా రక్తదాన చేస్తున్న సూది నరేశ్ తెలిపారు. ధర్మపాల్, వినిల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ రిమ్స్‌లో అపరేషన్ కోసం వచ్చిన అనాథ వ్యక్తికి మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన, 108 పైలెట్ లఖన్‌సింగ్ శుక్రవారం రక్తదానం చేశాడు. మహారాష్ట్రకు చెందిన మధు అనే వ్యక్తికి అపరేషన్ చేసేందుకు రక్తం అవసరం ఉందని వైద్యులు తెలుపగా.. ఎవరూ ముందుకు కాకపోవడంతో విషయం తెలుసుకున్న 108 పైలెట్ లఖన్‌సింగ్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు.

'మనబడి' తోట పరిశీలన

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మనబడి తోటను మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి శుక్రవారం పరిశీలించారు. మనబడి తోటలో కూరగాయాల సాగును పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన కూరగాయలను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు డీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా

బోథ్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, రిలీజియస్ మైనార్టీ, పేద కులాల వారికి నాణ్యమైన విద్య, ఉచితంగా ఇల్లు, భూమి అందించాలని డిమాండ్ చేస్తూ బోథ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపడుతున్నట్లు మండల కమిటీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరగడానికి చేస్తున్న ధర్నా కార్యక్రమానికి ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

దీక్షా దివస్‌కు తరలిన నాయకులు

బోథ్: జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి బోథ్ మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే పంటను అమ్ముకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామిని నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య, రాజేశ్, జగదీశ్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తుకారాంను ఆదర్శంగా తీసుకోవాలి

తొలి ఆదివాసీ ఐఏఎస్ అధికారి మడావి తుకారాంను నేటి యువత ఆదర్శంగా తసుకొని, వారి అడుగుజాడల్లో నడవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎక్స్‌రోడ్డు గ్రామంలో తొలి ఆదివాసీ ఐఏఎస్ మడావి తుకారాం 26వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తుకారాం స్వగామమైన లక్షెటిపేటలో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి వారు చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా మేడి దుర్గు, పెందూర్ ప్రభాకర్, మర్సుకోల తిరుపతి, సట్ల అశోక్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి గణిత ప్రతిభ పరీక్ష



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీకాంత్

తాంసి: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకొని భీంపూర్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో, తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో, పొన్నారి, కప్పర్ల, గోట్కూరి పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మండలస్థాయి ప్రతిభ పరీక్ష నిర్వహించారు. అర్లి(టి), పిప్పల్‌కోటి, అందర్‌బంద్, కరంజి(టి)కి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికైనా విద్యార్థులను ఎంఈవో శ్యాంసుందర్, తాంసి ఎంఈవో శ్రీకాంత్, తహసీల్దార్ నలందప్రియ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కాంచన, సంధ్యారాణి, శివకుమార్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మహేందర్, సురేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో మండలస్థాయి గణితం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎంఈవో పవార్ అనిత ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంగ్లీష్ మీడియంలో మొదటి స్థానంలో మన్విస్, రెండో స్థానంలో సాయి కిరణ్, మూడో స్థానంలో ఆదిత్య నాయక్, తెలుగు మీడియంలో మొదటి స్థానం పరమేశ్వర్, రెండో స్థానంలో యశోద సాధించినట్ల ఆమె తెలిపారు.

బాజీరావు చూపిన బాటలో పయనించాలి



శోభాయాత్రలో పాల్గొన్న కంది సాయి మౌనరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆధ్మాతిక గురువు బాజీరావు చూపిన బాటలో ప్రతిఒక్కరూ పయనించి ఆధ్మాత్మికతను అలవర్చుకోవాలని, కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది సాయి మౌన రెడ్డి అన్నారు. జైనథ్ మండలంలోని బాలాపూర్ గ్రామంలో సప్తాహ వేడుకలకు హాజరయ్యారు. బాజీరావు బాబా భక్త మండలి, గ్రామస్తులు ఆమెకు స్వాగతం పలికారు. ముందుగా బాజీరావు బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భజన మండలి నిర్వాహకులతో కలిసి తాళాలు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, మాజీ సర్పంచ్ రౌత్ దామోదర్, మాజీ ఉప సర్పంచ్ చెన్న గజానన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల, గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో ఫుడ్‌పాయిజన్‌ను నిరసిస్తూ శనివారం ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేపడుతున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ అన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, వసతిగృహాల్లో ఫుడ్‌పాయిజన్ జరుగుతుందన్నారు. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థిని మృతి చెందిందన్నారు. స్వచ్ఛందంగా పాఠశాలలను బంద్ పాటించి సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ కొట్నాక్ సక్కు, గెడం కేశవ్, సాయి, అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి దత్తాత్రి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదర్శన్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని గతేడాది హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఏడాది గడిచినా తమ సమస్యలపై పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు మంజుల, ప్రియాంక, ఆఫ్రీన్, రాజన్న, నరేష్, అశ్వక్, శంకర్, రాజేశ్వర్, జావిద్, తేజస్వి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'రైతు పండుగ'



రైతు పండుగలో పాల్గొన్న సిబ్బంది



రైతు పండుగలో అధికారులు, రైతులు

గుడిహత్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సహకార రైతు పండుగను మండలంలో గుడిహత్నూర్, మన్నూర్ పీఏసీఎస్‌లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, సేవలను ఆయా సహకార సంఘాల సీఈవోలు పండరి, వెంకటేశ్‌లు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల చైర్మన్‌లు సంజీవ్ ముండే, ప్రకాష్ కరాడ్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బోథ్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు పండుగను విజయవంతం చేయాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే క్లస్టర్ల వారిగా ఆదర్శ రైతులను ఏర్పాటు చేస్తామన్నారు.

నేరడిగొండ: రైతు పండుగ వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. సంఘ సీఈవో బారే నాగభూషణం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు..

ఆదిలాబాద్‌టౌన్: మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం జరిగే రైతు పండుగ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు తమ తమ మండల పరిధిలోని రైతువేదికల్లో పాల్గొనాలని కోరారు.

నేడు 'రైతు పండుగ'

ఇచ్చోడ: రైతు పండుగ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో మధ్యాహ్నం 2 గంటలకు వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసగించనున్నట్లు ఇచ్చోడ ఏఈవో సంజీవ్‌నాయక్ తెలిపారు. రైతుపెట్టుబడి సాయం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ధాన్యం కొనుగోళు విషయాలపై రైతులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మాట్లాడనున్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న చిట్యాల సుహాసినిరెడ్డి

బేల: రాష్ట్ర ప్రభుత్వం బేలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థినుల సమస్యలపై ఆరా తీశారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, బోనిరిగివార్ గణేష్, సలాం దేవ్‌రావు, తాక్రే సందీప్, రామెల్లి మోరేశ్వర్, పోత్రాజ్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.